సాగింది. అనాదిగా ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని మట్టుపెట్టిందీ సమాజం. ఇప్పుడిప్పుడే స్త్రీలు బాగా చదువుకుంటూ ఉద్యోగాల్లో కొస్తున్నారు. చిన్నప్పటినుండి ఆమె ఆలోచనా విధానమే వేరు. తనకు ఫలానా వస్తువు కావాలని నోరు విడిచి తన తలిదండ్రుల్ని ఏనాడూ అడగలేదు. పెద్దయ్యాకా ఉద్యోగం చేసుకుని తనకు కావలసినవి కొనుక్కోవాలనుకుంది. దేనికీ ఎవరినీ యాచించవలసిన దుస్థితి తనకు కలుగకూడదు. అందుకే అమ్మ వద్దంటున్నా డిగ్రీ వరకు చదివింది. నాన్న కిష్టం లేకపోయినా ఉద్యోగంలో చేరింది. తన సంపాదనను తనకు ఇష్టం వచ్చిన రీతిలో ఖర్చు పెట్టుకోవాలనుకుంది. పెళ్ళికి పూర్వం తనకా విషయంలో అణుమాత్రమైనా ప్రతిఘటన ఎదురవలేదు. ఆమె మనస్తత్వాన్ని పూర్తిగా చదివిన తండ్రి ఏనాడూ తన జీతం గురించి గాని, తను పెడుతున్న ఖర్చును గురించి గాని ప్రశ్నించలేదు. తరువాత తనకు పెళ్ళి ప్రయత్నాలు జరిగాయి. వివాహం తన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని హరించి వేస్తుందని తెలియక తలవంచి తాళి కట్టించుకుంది. జరుగుతున్నది తలచుకుంటూవుంటే దుఃఖం ఆగడంలేదు. ఇకనుండి తను సంపాదించినదంతా కట్టుకున్నవాడి చేతుల్లో గుమ్మరించాలి. ఏం కావాలన్నా పతిదేవుణ్ణి దేవులాడాలి. ఏమిటీ ఖర్మ?... అందుకేనా తను చదువుకుంది?... ఈ మాత్రానికేనా తను ఉద్యోగం చేస్తోంది?... మన సంఘంలో ఉద్యోగినులంతా చేసే పని ఇదేనా?...



## అవగాహన

అలివేణి హృదయ కడలిలో చెలరేగుతున్న సంచలనాన్ని గ్రహించని ఉమాపతి లైటార్పి భార్యను దగ్గరకు తీసుకున్నాడు.

ఆ రాత్రి సంతోషంగా అతడితో సహకరించలేకపోయింది అలివేణి.

పదిహేను రోజులు గడిచాయి.

నెల రోజులు సెలవు పెట్టి పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమైంది అలివేణి. దగ్గరుండి భార్యని బస్సుకి దిగబెట్టాడు ఉమాపతి

ఒకరోజు తన క్లాస్‌మేట్ లావణ్యను చూడటాని కెళ్లింది అలివేణి. లావణ్య స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తోంది.

అలివేణి రాకతో ఊరంత సంబరపడిపోయింది లావణ్య.

ఆమె వారిస్తున్నా వినకుండా జీడిపప్పు ఉప్మా చేసి పట్టుకొచ్చింది. ఆ మాట ఈ మాట అయ్యేకా "ఎలా వుంది నీ వైవాహిక జీవితం? ఎక్కడికీ హనీమూన్ ట్రిప్పు వెయ్యలేదా?" అంటూ సంభాషణలోకి దింపింది.

లావణ్య ప్రశ్నతో అదివరకున్న ఉత్సాహం కాస్త నీళ్లు కారిపోయింది. ముఖంలో రంగులు మారాయి.

"ఏమిటలా అయిపోయావ్" అడిగింది లావణ్య.

"ఆయనకు విడాకు లివ్వాలనుకుంటున్నాను"

అలివేణి మాటలకు అదిరి పడింది లావణ్య.

"అవేం మాటలే. పెళ్లై రెండు మాసాలైనా కాలేదు..."

"నేను ఉద్యోగం చేస్తున్నది ఒకరిపై ఆధారపడి బ్రతకటానికి కాదు. నాకు ఆర్థిక స్వేచ్ఛ కావాలి. అది ఆయనవద్ద కరువైంది. తిలకం సీసా కావాలన్నా, కాటుక డబ్బీ కొనుక్కోవాలన్నా చేయి చాపాలి. నా మనసు అందుకు అంగీకరించడం లేదు. వైవాహిక జీవితానికి తిలోదకాలిచ్చి స్వేచ్ఛగా బ్రతకాలని నిర్ణయించుకున్నాను" అంటూ లేచి నిలబడింది అలివేణి.

"కూర్చో"

బొమ్మలా చతికిలబడింది అలివేణి.

"చిన్నప్పటినుండి నీ సైకాలజీ నెరిగిన దానిని. పెళ్లైతే నీ ధోరణి మారుతుందనుకున్నానే తప్ప ఇటువంటి విపరీత నిర్ణయాలు తీసుకుంటావనుకోలేదు. నేనో ప్రశ్న అడుగుతాను సూటిగా సమాధానం చెబుతావా?"

ప్రశ్నార్థకంగా ముఖం పెట్టింది అలివేణి.

"మీ ఆయనకు వ్యసనాలేవైనా ఉన్నాయా?"... విచ్చల విడిగా డబ్బు ఖర్చు చేస్తాడా"

"అటువంటిదేమీ లేదు"

"మరింకేం? నువ్వు సంపాదించినా, మీ వారు గడించినా సంసారం కోసమే కదా! భార్యా భర్తల మధ్య సర్దుబాటు ధోరణి ఉండాలి. నీకు తెలుసునో తెలియదో నేను గెజిటెడ్ ఆఫీసర్ని అయినా నేను పెళ్లాడింది ఒక సాధారణ గుమాస్తాని. ఐనా నా సర్వస్వాన్ని ఆయనకు అర్పించడానికి నా మనసు ఏనాడూ వెనుకాడదు. మన సమాజంలో ప్రతి మహిళ మగడు తనకంటె ఉన్నతంగా వుండాలని కోరుకుంటుంది భార్యాభర్తలు షాపింగుకు బయలుదేరి నప్పుడు భర్త నిరుద్యోగి అయినా భార్య అతడి చేతికి డబ్బిచ్చి కావలసినవి కొని పిస్తుంది. అంతమాత్రాన ఆమె హోదా తగ్గిపోదు. సరికదా పెరుగుతుంది. భార్య తనకు కావలసిన దానిని భర్త నడిగి పొందడంలో వున్న ఆనందం స్వతంత్రంగా సంపాదించుకోవడంలో ఉండదు. రానురాను నీకా విషయం అర్థమౌతుంది. తొందరపడి నిర్ణయాలు తీసుకోకు" నచ్చచెప్పేందుకు ప్రయత్నించింది లావణ్య.

"ఏమో! నువ్వెన్ని చెప్పు నే నా పద్ధతికి అలవాటు పడలేకపోతున్నాను."

"పోనీ నేనో సలహా ఇవ్వనా?"

అంతకన్నా కావలసినదేమిటనుకుంది అలివేణి.

"మీరు బ్యాంకులో జాయింట్ ఎకౌంట్ ప్రారంభించి మీరు తెచ్చుకున్న జీతాలు అందులో వేసుకోండి. ఎవరికి ఎప్పుడు ఎంత కావాలో డ్రా చేసుకోండి. ఖర్చు విషయానికొస్తే ఇరువురూ జాగ్రత్త పరులే గనుక సమస్యలు ఉత్పన్నం కావు.

"థాంక్స్ లావణ్యగారూ. మీ సలహా నాకు నచ్చింది." అన్నాడు ఉమాపతి లోపలకొస్తూ.

"మీరు..." భర్త వంక ఆశ్చర్యంగా చూసింది అలివేణి.

"ఇప్పుడే వచ్చాను. నువ్వు మీ ఫ్రెండ్ లావణ్యగారింటికి వెళ్ళినట్లు మావయ్య గారు చెప్పారు."

"ఇకనేం నీ భర్త కూడ నా ప్రపోజల్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసారు. నువ్వు కూడ అంగీకరిస్తే నీ పచ్చని సంసారం పండంటి కాపుర మవుతుంది" అన్నది లావణ్య నవ్వుతూ.

అంగీకార సూచకంగా చిరునవ్వు నవ్వింది అలివేణి.

"పద వెళదాం" ఆమె చేయి నందుకున్నాడు ఉమాపతి.

లావణ్య ఎదలో పన్నీటి జల్లు కురిసింది.

○

## ముఖ్యమంత్రుల 'హీరోయిన్'!

ముగ్గురు ముఖ్యమంత్రుల సరసన నటించిన ఖ్యాతి తమిళ నటి మనోరమకు చెందుతుంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రులు స్వర్గీయ సి. ఎన్. అన్నాదురై, కీర్తిశేషులు ఎం. జి. రామచంద్రన్, ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ ఎం. కరుణానిధితో ఆమె నటించింది. అన్నాదురై, కరుణానిధితో మనోరమ పలునాటకాలలో నటించగా– ఎం. జి. రామచంద్రన్‌తో అనేక చిత్రాలలో నటించింది. కాగా– 1985 వ సంవత్సరం నాటికే మనోరమ 1000 పైగా తమిళ చిత్రాలలో నటించి రికార్డు నెలకొల్పింది.

భూమారెడ్డి